సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 23 । జూన్ । 2025



రారండోయ్..
వేడుక చూద్దాం.. 8లో



వైజాగ్‌లో
వండర్ పార్క్ 8లో



పాలిసెట్ కౌన్సెలింగ్‌కు
విశేష స్పందన 8లో

వల నిండింది.. పంట పండింది





మత్స్యకారుల పంట పండింది. చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లిన జాలర్ల కష్టం ఫలించింది. కాసులు కురిపించే చేపలు, రొయ్యలు వలలకు చిక్కడంతో మత్స్యకారులు సంబరపడ్డారు. బోట్లు ఒడ్డుకు చేరగా విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం తాజా రొయ్యలు, చేపలు దర్శనమిచ్చాయి. సుమారు రెండు నెలల విరామం తరువాత ఈ నెల 15వ తేదీన అర్ధరాత్రి వేటకు వెళ్లిన మత్స్యకారులు తొలుత రొయ్యల వేటపైనే అధికంగా దృష్టి సారించారు. దీంతో పింక్ బ్రౌన్ రొయ్యలు అత్యధికంగా లభించాయి. చేపలు కూడా విరివిగా దొరకడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు. వేట విరామం తరువాత మత్స్య సంపద ఆశాజనకంగా లభించడంతో కొంత వరకు ఊరట చెందినట్లు మత్స్యకారులు పేర్కొన్నారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం









కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ సేవలు బంద్

- మూలనపడ్డ కార్డియాలజీ– పల్మనరీ బైపాస్ మిషన్ (సీపీబీ)
- వైఎస్సార్‌సీపీ హయాంలో నిరంతరాయంగా ఓపెన్ హార్ట్ సర్జరీలు



కార్డియాలజీ విభాగం

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్‌లో గుండె (ఓపెన్ హార్ట్) శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. ఈ సర్జరీలు నిర్వహించే పరికరం కార్డియాలజీ పల్మనరీ బైపాస్ మిషన్(సీపీబీ) మరమ్మతులకు గురవడంతో.. కొద్ది రోజులుగా ఈ సేవలకు బ్రేక్ పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రులకు అవసరమైన వైద్య పరికరాలను ఎప్పటికప్పుడు సమకూర్చేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదల ఆరోగ్యంపై నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. కేజీహెచ్‌కు ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచీ పేద రోగులు ఎక్కువగా వస్తుంటారు. ప్రైవేట్/కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో ఇలాంటి వారికి కేజీహెచ్ పెద్ద దిక్కుగా మారింది. కేజీహెచ్ కార్డియాలజీ విభాగం రెండో అంతస్తులో కార్డియోథొరసిక్ విభాగంలో వైద్యులు ఈ శస్త్రచికిత్సలు అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సీపీబీ మిషన్ తెప్పించి, శస్త్ర చికిత్సలకు ఆటంకం లేకుండా చూశారు. ఓపెన్ హార్ట్ సర్జరీలు, స్టంట్లు, గుండెలో బ్లాక్‌లకు అవసరమైన వైద్య సేవలు అందిస్తూ వచ్చారు. ఇప్పుడీ సేవలకు అంతరాయం కలగడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్జరీ సమయంలో హార్ట్‌కు పంపింగ్ చేసేందుకు సాయపడే ఈ పరికరం లేకపోతే సర్జరీలు చేయడం చాలా కష్టం అని వైద్యులు చెబుతున్నారు.

బదిలీ కౌన్సెలింగ్ బాయ్‌కాట్

డీఈవో కార్యాలయాన్ని ముట్టడించిన ఎంటీఎస్ టీచర్లు



డీఈవో కార్యాలయం ముందు బైఠాయించి ప్లకార్డులు చూపుతున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

- గత ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.39ను పట్టించుకోవట్లేదని ఆవేదన
- సర్వీసంతా ఏజెన్సీలోనే పనిచేయాలనడంపై ఆక్షేపణ
- మైదాన ప్రాంతంలోని ఖాళీల్లో బదిలీ చేయాలని డిమాండ్

ఆరిలోవ : విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) కార్యాలయాన్ని మినిమం టైం స్కేల్(ఎంటీఎస్) ఉపాధ్యాయులు ఆదివారం ముట్టడించారు. బదిలీ కౌన్సెలింగ్‌ను బాయ్‌కట్ చేశారు. 1998, 2008 డీఎస్సీల ఎంటీఎస్ ఉపాధ్యాయులకు బదిలీల కౌన్సెలింగ్ విశాఖ వ్యాలీ స్కూల్‌లో ఆదివారం నిర్వహించేందుకు విద్యాశాఖాధికారులు సన్నద్ధమయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నారని తెలుసుకున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మైదాన ప్రాంతాల్లో ఖాళీలు చూపించడం లేదంటూ కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేశారు. వారికి పలు ఉపాధ్యాయ సంఘాలు సంఘీభావం తెలిపాయి. డీఈవో కార్యాలయాన్ని ముట్టడించి, తమకు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. డీఈవో కార్యాలయం నుంచి విశాఖ వ్యాలీ స్కూల్ వద్దకు వెళ్తున్న డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్‌ను చుట్టుముట్టారు. తమకు న్యాయం చేయాలని, మైదాన ప్రాంతంలోని పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యా శాఖాధికారులు బలవంతంగా తమను కొండలపైకి పంపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జీవో నంబరు 39 ద్వారా ఎంటీఎస్ ఉపాధ్యాయులకు నివాసముంటున్న ప్రాంతాలకు దగ్గరలో ఉద్యోగం చేసుకునే సౌలభ్యం కల్పించిందన్నారు. ఇటీవల విద్యాశాఖా మంత్రి లోకేష్‌ను కలిస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆయన ఇచ్చిన హామీని నెరవేర్చకుండా మాట మార్చి మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర జీతాలతో ఉన్న తమపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. కౌన్సెలింగ్‌కు ఎవరూ హాజరుకాకపోవడంతో విద్యాశాఖాధికారులు సాయంత్రం వరకు వేచిచూడాల్సి వచ్చింది.

ఖాళీలన్నీ ఏజెన్సీలోనే చూపిస్తున్నారు..



ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో ఖాళీలన్నీ ఏజెన్సీ ప్రాంతంలోనే చూపిస్తున్నారు. ఇప్పటికే రెండేళ్లు కొండలపై ఉద్యోగాలు చేశాం. ఇప్పుడు కూడా కొండ ప్రాంతాలకే బదిలీపై వెళ్లాలి. ఇప్పుడు వెళ్తే రిటైర్‌మెంట్ వరకు అక్కడ పనిచేయాల్సిందే. మాకు వచ్చే జీతం రూ.32 వేలు. ఎలాంటి అలవెన్సులు ఉండవు. అయినా కొండ ప్రాంతాల్లోనే సర్వీసంతా పనిచేయాలంటున్నారు.

-టి.లింగమూర్తి, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయుడు

జీవో అమలుచేయాలి



1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయుల కోసం 2023లో అప్పటి ప్రభుత్వం జీవో నెం.39ను విడుదల చేసింది. దాని ప్రకారం ఎంటీఎస్ ఉపాధ్యాయులను నివాసాలకు దగ్గరగా ఉండేలా బదిలీలు జరగాలి. ఇప్పుడు ఆ జీవో ప్రకారం జరగట్లేదు. ప్రస్తుతం ఖాళీలన్నీ పాడేరు, ముంచంగిపుట్టు, కొయ్యూరు, పెదబయలు, అరకు, అనంతగిరి తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే అక్కడ రెండేళ్ల పాటు వారంతా ఉద్యోగాలు చేశారు. ఇప్పుడు మైదాన ప్రాంతాల్లో బదిలీ చేయాలని కోరుతున్నాం.

– డి.గోపీనాథ్, పీఆర్‌టీయూ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు

సర్వీసంతా అక్కడే చేయాలా..



1998, 2008 డీఎస్సీ బ్యాచ్‌ల్లో 425 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులం ఉన్నాం. ఇటీవల రెగ్యులర్ ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాల్లో నింపేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఖాళీలు చూపిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ అక్కడకు వెళ్తే సర్వీసంతా అక్కడే ఉద్యోగం చేయాలి. మాకొచ్చే జీతాలతో అక్కడ గడపడం ఎంత కష్టమో తెలియని కాదు. విద్యాశాఖాధికారులు న్యాయం చేయాలి..

– రాజు, 2008 బ్యాచ్

క్లస్టర్ల ద్వారా భర్తీ చేయాలి



ఉమ్మడి విశాఖ జిల్లాలో 220 క్లస్టర్లు ఉన్నాయి. క్లస్టర్ల పరిధి మైదాన ప్రాంతాల్లో ఖాళీ పోస్టులు ఉంటాయి. ఆ ఖాళీల్లో మమ్మల్ని భర్తీ చేస్తే కొందరికైనా మైదాన ప్రాంతాల్లో పనిచేసే అవకాశం కలుగుతుంది. ప్రభుత్వం మమ్మల్ని చిన్నచూపు చూస్తోంది. మాకు న్యాయం జరిగే వరకు బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరుకాము.

– లక్ష్మి, 2008 బ్యాచ్

జాబ్ లేదు.. భృతి రాదు

- ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనకు దిక్కే లేదు..
- నేటి 'యువత పోరు'ను విజయవంతం చేయండి
- వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపు



సాక్షి, విశాఖపట్నం : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఇంటికొక ఉద్యోగం.. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను మోసం చేస్తోందని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మండిపడ్డారు. ఆదివారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏటా జనవరి 1వ తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న హామీకి తూట్లు పొడిచిందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన ఇవ్వకుండా అడుగడుగునా దగా చేసిందన్నారు. యువతకు, నిరుద్యోగులకు ఇస్తానన్న హామీలను నెరవేర్చకపోవడాన్ని నిరసనగా.. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 23వ తేదీన వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 'యువత పోరు' నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో ఉన్న యువత, విద్యార్థులు, వైఎస్సార్ సీపీ అభిమానులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద గల కృష్ణమందిర్ జంక్షన్ నుంచి పాదయాత్రగా బయలుదేరి కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేస్తామన్నారు. అక్కడ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఈ ఉద్యోగానికి ఓ దండం

- 'యోగాంధ్ర'కు ప్రజలను తీసుకెళ్లి అవమానపడ్డాం
- అందరితోనూ చీవాట్లు తిన్నాం
- జీవీఎంసీ ఆర్పీల కన్నీటి ఆవేదన



డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం గొప్పలకు పోయి నిర్వహించిన 'యోగాంధ్ర-2025'కార్యక్రమం జీవీఎంసీ పరిధిలోని రిసోర్స్ పర్సన్ల(ఆర్పీ)కు తీవ్ర ఆవేదనను, అవమానాన్ని మిగిల్చింది. అధికారుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు, సౌకర్యాలు కల్పించడంలో వైఫల్యం కారణంగా తాము ప్రజల చేత మాటలు పడాల్సి వచ్చిందని, ఈ ఉద్యోగమే వద్దనుకునేంతగా మానసిక క్షోభ అనుభవించామని ఆర్పీలు వాపోతున్నారు.

ప్రధాని మోదీ పాల్గొన్న 'యోగాంధ్ర'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో అధికారులు జన సమీకరణ బాధ్యతను పూర్తిగా ఆర్పీల మీద పెట్టారు. ప్రతి ఆర్పీ వందల మందిని కార్యక్రమానికి తీసుకురావాలని లక్ష్యాలు నిర్దేశించారు. ఉదయం 6.30 గంటలకల్లా కార్యక్రమం ముగిసి, 8 గంటలకంతా అందరూ ఇళ్లకు వెళ్లిపోవచ్చని, అక్కడ అల్పాహారం, మంచినీటి సౌకర్యాలు ఉంటాయని జనాలకు నచ్చజెప్పి ఆర్పీలు వారిని తీసుకువచ్చారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి పూర్తి భిన్నంగా మారింది. గంటల తరబడి ప్రజలు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. నిర్వాహకులు కనీసం తాగడానికి మంచినీళ్లు కూడా అందించలేకపోయారు. మ్యాట్‌ల కోసం కొట్టుకున్నారు. స్నాక్స్ కోసం తోపులాటలు జరిగాయి. దీంతో ఆర్పీలు తీసుకువచ్చిన జనం, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాహంతో, ఆకలితో అలమటించారు. చివరకు తమను తీసుకువచ్చిన ఆర్పీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమం కోసం ఎంతో కష్టపడితే అన్ని వైపుల నుంచి తిట్లు..చీవాట్లు మిగిలాయంటూ ఆర్పీలు వాట్సాప్ గ్రూపుల్లో ఆవేదన చెందుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం, ఆర్పీల ఆవేదన

'వేకువ జామున 2 గంటల నుంచి ఇంటింటికి వెళ్లి వారి తలుపులు తట్టి జనాన్ని యోగాంధ్రకు తీసుకెళ్లాం. గుండె జబ్బు ఆపరేషన్ చేయించుకున్న ఓ ఆర్పీ యోగాంధ్రకు 100 మందిని తీసుకెళ్లారు. అయితే ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యాం. ఒకవైపు అధికారుల నుంచి ఒత్తిడి, మరోవైపు స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజల నుంచి చీదరింపులు ఎదుర్కొన్నాం. పని పూర్తయ్యాక అధికారులు చల్లగా జారుకున్నారు. కానీ మేం మాత్రం ప్రజల చేత తిట్లు తినాల్సి వచ్చింది. మమ్మల్ని నమ్మి వచ్చినవారికి గుక్కెడు నీళ్లు ఇవ్వలేకపోయాం. తీసుకెళ్లిన వాళ్లు ప్రాణాలతో తిరిగి వస్తే చాలు అనుకునేంత నరకాన్ని చూశాం' అని ఆర్పీలు తమ గ్రూపుల్లో ఆవేదన వ్యక్తం చేశారు. 'కేవలం రూ.10వేల జీతానికి ఇంతటి అవమానమా? 20 ఏళ్లుగా ఈ వృత్తిలో ఉన్నాం, కానీ ఇంతటి దారుణమైన పరిస్థితి ఎప్పుడూ ఎదుర్కోలేదు. గతంలో ఏ కార్యక్రమం జరిగినా ఆహారం, నీళ్ల బాధ్యత మాకే అప్పగించేవారు. కానీ ఇప్పుడు మమ్మల్ని కేవలం జన సమీకరణకే వాడుకుని, తర్వాత బలిపశువులను చేశారు' అని వాపోయారు. ఈ మానసిక వేదనతో ఉద్యోగాలకు రాజీనామా చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని పలువురు ఆర్పీలు పేర్కొన్నారు.

సంక్షేమం లేదు గానీ.. మద్యం దుకాణాలా?

- నివాసాల మధ్య వైన్ షాపు వద్దు
- అడ్డుకున్న 39వ వార్డు మహిళలు



మద్యం దుకాణం ముందు బైఠాయించిన స్థానిక నివాసితులు

జగదాంబ: ప్రశాంతంగా ఉండే తమ నివాస ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడానికి వీల్లేదంటూ జీవీఎంసీ 39వ వార్డు మహిళలు ముక్తకంఠంతో నినదించారు. ఆదివారం ఉదయం దుకాణం ఏర్పాటుకు ప్రయత్నించిన వారిని స్థానిక మహిళలు, నేతలు అడ్డుకుని వెనక్కి పంపారు. కూటమి ప్రభుత్వం గతంలో నిర్వహించిన మద్యం దుకాణాల వేలంలో ఓ వ్యక్తి లైసెన్సు దక్కించుకున్నారు. మొదటగా జీవీఎంసీ 37వ వార్డు జబ్బర్‌తోటలో, ఆ తర్వాత 34వ వార్డు కొబ్బరితోటలో దుకాణం తెరిచేందుకు ప్రయత్నించగా అక్కడి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. దీంతో 39వ వార్డు పరిధి వాడవీధిలో దుకాణం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు యజమాని మద్యం సరకుతో కూడిన వాహనంతో వాడవీధికి చేరుకున్నారు. ఈ ప్రాంతం జనవాసాలు, ఆసుపత్రి, దేవాలయం ఉన్న ప్రశాంతమైన ప్రదేశం కావడంతో, విషయం తెలుసుకున్న మహిళలంతా ఒక్కసారిగా అక్కడికి చేరుకున్నారు. తమ నివాసాల మధ్య మద్యం దుకాణం పెట్టడానికి ససేమిరా ఒప్పుకోమని తేల్చిచెప్పారు. యజమాని పట్టుబట్టడంతో కొందరు మహిళలు కర్రలతో ముందుకు వచ్చి మద్యం సీసాలను పగలగొడతామని హెచ్చరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో, యజమాని చేసేదేమీ లేక మద్యం సరకుతో సహా వెనుదిరిగారు. ఈ సందర్భంగా మహిళలు ప్రభుత్వాన్ని నిలదీశారు. 'సంక్షేమ పథకాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం.. ప్రజల జీవితాలను నాశనం చేసే మద్యం దుకాణాలను మా వీధుల్లోకి పంపుతారా?'అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

పార్టీలకతీతంగా ఏకమైన స్థానికులు

ఈ నిరసనలో రాజకీయాలకు అతీతంగా స్థానిక నేతలు పాల్గొనడం విశేషం. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ముజీబ్ ఖాన్, జనసేన నాయకురాలు కొల్లి సింహాచలం మహిళలకు మద్దతుగా నిలిచి, దుకాణం ఏర్పాటును అడ్డుకున్నారు. 'ప్రభుత్వ నిబంధనలను విస్మరించి గుడులు, బడులు, ఆసుపత్రులు, నివాస గృహాల మధ్య మద్యం దుకాణాన్ని ఎలా ఏర్పాటు చేస్తారు?' అని వారు ప్రశ్నించారు. అనంతరం స్థానికులతో కలిసి అక్కడే బైఠాయించి, తమ ప్రాంతంలో మద్యం దుకాణం వద్దంటూ నినాదాలు చేశారు.

ఇదేనా కూటమి లక్ష్యం?



ప్రభుత్వం నివాస గృహాల మధ్య మద్యం దుకాణాలు పెట్టి, ఇంటిల్లపాదీ మద్యం తాగమని ప్రోత్సహిస్తోందా? ఇదేనా మీ కూటమి లక్ష్యం? ప్రజలకు మంచి చేయడం అంటే మద్యం దుకాణాలు పెట్టించడం కాదు.

– పద్మావతి, వాడవీధి

పిల్లలు చెడిపోతారు..



భార్యాభర్తలు రోజూ తన్నుకోవడానికా? మా ఇంటి పక్కనే దుకాణం పెడుతున్నారు. మద్యం దుకాణం వల్ల ఇళ్లలో పిల్లలు కూడా చెడిపోతారు. ఇక్కడ దుకాణం పెడితే మహిళలు ఉగ్రరూపం చూస్తారు.

– లక్ష్మి, వాడవీధి, జీవీఎంసీ 39వ వార్డు

మహిళలకు రక్షణ ఉండదు



ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు. ఎక్కడ, ఎప్పుడేం జరుగుతుందో తెలియడం లేదు. ఇటువంటి రోజుల్లో వీధికో మద్యం దుకాణం ఇచ్చి ఇంకా ఇబ్బందులు పాలు చేస్తారా? మద్యం దుకాణంతో గొడవలు, దొంగతనాలు ఎక్కువవుతాయి.

– అమీదబేగం, వాడవీధి, జీవీఎంసీ 39వ వార్డు

ఇట్లుంటది కూటమి ప్రభుత్వంతో..



సంక్షేమ పథకాలు ఇవ్వమంటే మద్యం దుకాణాలు ఇస్తున్నారు. ఇదేనా కూటమి ప్రభుత్వం పాలన? పేదలకు సంక్షేమ పథకాలు ఇవ్వడం మానేసి, వీధికో మద్యం దుకాణం ఇచ్చారు. ఇంకా అప్పుల పాలు కావాలని చూస్తున్నారా?

– అరుణ, వాడవీధి, జీవీఎంసీ 39వ వార్డు

ప్రశాంతతకు భంగం



ప్రశాంత వాతావరణంలో ఇటువంటి మద్యం దుకాణాలు పెట్టి కక్షలు పెంచుతారా? వైన్‌షాపు పెడితే నిత్యం అల్లర్లు, తగాదాలు తప్పవు. ముఖ్యంగా మహిళలకు రక్షణ లేకుండా పోతుంది.

– ఆర్.ఎం.జి.వి.ప్రసాదరావు, గానుగుల వీధి

ఉద్యోగుల కృషితోనే షిప్‌యార్డ్ అభివృద్ధి

కమొడోర్ హేమంత్ ఖత్రి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎండీ కమొడోర్ హేమంత్ ఖత్రి

సింధియా: హిందూస్తాన్ షిప్‌యార్డ్ 85వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వేడుకల్లో భాగంగా సంస్థ ఆవరణలోని వాల్‌చంద్ హీరాచంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉద్యోగుల మౌలిక సదుపాయాలను పెంచే లక్ష్యంతో చేపట్టిన వాల్వ్ టెస్టింగ్ బే, డిజిటల్ కియోస్క్, పునరుద్ధరించిన డైనింగ్ హాల్, కొత్త పవర్ రూమ్ వంటి పలు సౌకర్యాలను సంస్థ సీఎండీ కమొడోర్ హేమంత్ ఖత్రి ప్రారంభించారు. అలాగే షిప్‌యార్డ్‌లో చేపట్టిన వివిధ ప్రాజెక్టులను తెలిపే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమంత్ ఖత్రి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తమ విధి నిర్వహణలో మానసిక ప్రశాంతతను కలిగి ఉంటేనే సంస్థ ఉత్పత్తిలో మెరుగైన ఉత్పాదకతను సాధించగలదన్నారు. సంస్థ చిన్న టగ్‌లను నిర్మించే స్థాయి నుంచి ఐఎన్ఎస్ ధ్రువ్, నిస్టార్ వంటివి నిర్మించే స్థాయికి ఎదిగిందన్నారు. ఇందులో ఉద్యోగుల కృషి ఎంతో ఉందని కొనియాడారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

మరణించి.. మరో ఇద్దరికి వెలుగునిచ్చి..

పెందుర్తిలో మృతి చెందిన వ్యక్తి నేత్రాలు దానం చేసిన కుటుంబసభ్యులు





నగేష్ కళ్లు తీసుకునేందుకు అంగీకారం తెలుపుతున్న నగేష్ భార్య హిమబిందు (ఇన్‌సెట్) నగేష్ (ఫైల్)

పెందుర్తి: అనారోగ్యంతో మరణించిన వ్యక్తి నేత్రాలు దానం చేసి మానవత్వం చాటుకుంది ఓ కుటుంబం. పెందుర్తి సాయినగర్‌కు చెందిన రాపేటి నగేష్(45) ఆరోగ్యం క్షీణించి శనివారం రాత్రి మృతి చెందారు. ఈ నేపథ్యంలో స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్, స్థానిక పెద్దలు శరగడం మధు, పెంటకోట రమణ అక్కడకు వెళ్లి నగేష్ కళ్లు దానం చేస్తే మరో ఇద్దరికి కంటి చూపు ఇచ్చినవారు అవుతారని కుటుంబ సభ్యులను ఒప్పించారు. వెంటనే భర్త నేత్రాలు దానం ఇచ్చేందుకు నగేష్ భార్య హిమబిందు అంగీకరిస్తూ సంతకం చేశారు. అక్కడకు చేరుకున్న ఎల్‌వీ ప్రసాద్ సారథ్యంలోని మోషన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు నగేష్ నేత్రాలను సేకరించి సురక్షితంగా ఆసుపత్రికి తరలించారు. పుట్టెడు దుఃఖంలోనూ నగేష్ కుటుంబ సభ్యులు మానవత్వాన్ని చూపిన తీరుపై స్థానికంగా ప్రశంసలు వెల్లువెత్తాయి.

వైజాగ్‌లో వండర్ పార్క్

విజ్ఞానం, వినోదం పంచే బయో డైవర్సిటీ పార్క్
బయాలజీ విద్యార్థులతో నిత్యం కళకళ


పార్కులో పెంచుతున్న అరుదైన మొక్కలు

నగర జీవితంలోని కాంక్రీట్ జంగిల్‌కు భిన్నంగా, స్వచ్ఛమైన ప్రకృతి ఒడిలో సేదతీరాలని ఉందా? అరుదైన మొక్కల గురించి తెలుసుకుంటూ, వాటి అందాలను ఆస్వాదించాలనుకుంటున్నారా? అయితే మీరు కచ్చితంగా పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించాలి. రాణి చంద్రమణి దేవి ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని ఈ ఉద్యానవనం.. ఎన్నో వింతలు, విశేషాలతో ప్రకృతి ప్రియులను, విద్యార్థులను ఆకట్టుకుంటోంది.

- బీచ్‌రోడ్డు



షేవింగ్ బ్రష్ ట్రీ

పేరుకు తగ్గట్టే దీని పువ్వులు అచ్చం షేవింగ్ బ్రష్‌ను పోలి ఉంటాయి. ఇది ఒక ఎడారి మొక్క. చూడటానికి ఆకర్షణీయంగా ఉంటుంది. దీని పూల కేశాలు సన్నటి తీగల్లా ఉంటాయి. లావుగా ఉండే దీని కాండం నీటిని నిల్వ చేసుకుంటుంది. వేసవిలో నీటి కొరత ఏర్పడినప్పుడు, ఆ నీటినే వాడుకుని జీవిస్తుంది. ప్రకృతి ఎంత గొప్ప ఇంజినీరో చెప్పడానికి ఈ మొక్క ఒక ఉదాహరణ.



కొండగోగు

అంతరించిపోతున్న మొక్కల్లో ఇదొకటిగా చెబుతారు. ఈ మొక్క చూడటానికి ఎంతో అందంగా ఉంటుంది. దీని పచ్చి కొమ్మలకు మంటపెడితే భగ్గున మండుతాయి. పక్షులు, తేనెటీగలు, సీతాకోకచిలుకలను అధికంగా ఆకర్షించే దీని పువ్వులు కప్పు ఆకారంలో ఉండటం మరో విశేషం.

ప్రకృతి అద్భుతాలకు చిరునామా



ఈ పార్క్ కేవలం చెట్ల సమాహారం కాదు.. జీవ వైవిధ్యానికి ఓ నిలువుటద్దం. అంతరించిపోతున్న జాతుల నుంచి విదేశీ వింతల వరకు ఇక్కడ కొలువుదీరిన ప్రతి మొక్కకూ ఓ ప్రత్యేక కథ ఉంది. పార్క్ సమన్వయకర్త డాక్టర్ ఎం. రామమూర్తి పర్యవేక్షణలో ఈ మొక్కల విశిష్టతలను విద్యార్థులకు, సందర్శకులకు వివరిస్తుండటం ఇక్కడి అదనపు ఆకర్షణ. ఈ పార్కులోని కొన్ని మొక్కల గురించి తెలుసుకుందామా?

కృత్రిమ హౌస్‌లో ఆర్కిడ్ల సోయగం



ప్రపంచంలోనే అత్యంత అందమైన పూల జాతుల్లో ఆర్కిడ్‌లు ఒకటి. వీటికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అలాంటి అద్భుతమైన మొక్కలు జీవ వైవిధ్య ఉద్యానవనంలో సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. 'ఈ మొక్కలు సాధారణంగా చల్లని ప్రాంతాల్లో పెరుగుతాయి. ఇవి మట్టిలో కాకుండా చెట్ల కాండాన్ని అల్లుకుని పెరుగుతూ, గాలిలోని తేమను పీల్చుకుంటూ జీవిస్తాయి. ముఖ్యంగా వేసవి కాలంలో ఇవి అధికంగా పుష్పిస్తాయి. ఆర్కిడ్‌ల ఆకారాలు, రంగులు విభిన్నంగా, ఆకర్షణీయంగా ఉంటాయి. ఆర్కిడ్‌లు జీవించడానికి చల్లని వాతావరణం అవసరం.' అని సమన్వయకర్త రామమూర్తి తెలిపారు. అందుకే జీవ వైవిధ్య ఉద్యానవనంలో ప్రత్యేకంగా ఒక కృత్రిమ ఆర్కిడ్ హౌస్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక్కడ తొట్టెల్లో బొగ్గు, కొబ్బరి పీచులను ఉపయోగించి మొక్కలను సంరక్షిస్తున్నారు. డ్యాన్సింగ్ లేడీ, ఎరైడ్స్ మల్టీఫ్లోర, డెండ్రోబియం ఎఫిల్లా, సింబిడియం వంటి అనేక రకాల ఆర్కిడ్ మొక్కలు ఇక్కడ కనువిందు చేస్తున్నాయి. వాటికి పూసే పువ్వులు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. మన దేశంలో మేఘాలయ, సిమ్లా ప్రాంతాల్లో ఇవి అధికంగా కనిపిస్తాయి.


పార్క్‌ను సందర్శించిన విద్యార్థులు (ఫైల్)

విద్యార్థులకు ప్రయోగశాల

ఈ బయోడైవర్సిటీ పార్క్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని బయాలజీ విద్యార్థులకు ఒక సజీవ ప్రయోగశాలగా మారింది. తమ పరిశోధనలు, ప్రాజెక్టుల కోసం విద్యార్థులు తరచూ ఇక్కడికి వస్తుంటారు. డాక్టర్ రామమూర్తి వారికి మొక్కల చరిత్ర, వాటి పెంపకం, వైద్య, పర్యావరణ ప్రయోజనాలను వివరిస్తూ వారిలో ప్రకృతిపై ఆసక్తిని పెంచుతున్నారు.

ప్రేమను పంచే మొక్కలు



ప్రేమకు గుర్తు గులాబీ పువ్వు మాత్రమే కాదు. అనేక అరుదైన మొక్కలు, వాటి పువ్వులు, ఆకులు కూడా ఉన్నాయి. బయోడైవర్సిటీ పార్కులో ఇటువంటి ప్రత్యేకమైన మొక్కలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా ప్రేమికులు తమ ప్రేమకు గుర్తుగా చెట్లపై పేర్లు రాస్తుంటారు. అయితే చాలామందికి తెలియని విషయం ఏమిటంటే.. 'వాలెంటైన్స్ ప్లాంట్' అనే ఒక మొక్క ఉంది. ఈ మొక్క ఆకులు చాలా మందంగా ఉండటం వల్ల వాటిపై పేర్లు రాసుకోవచ్చు. ఇలా రాసిన పేర్లు ఎప్పటికీ చెరిగిపోవు. అలాగే 'వాలెంటైన్స్ హార్ట్' అనే మరో అరుదైన మొక్క కూడా ఈ పార్కులో ఉంది. ఎడారి ప్రాంతాల్లో కనిపించే ఈ మొక్క చూడటానికి లవ్ సింబల్ ఆకారంలో ఉంటుంది. ఈ ప్రత్యేకత ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ మొక్కను 'స్వీట్ హార్ట్' అని కూడా పిలుస్తారు. ఇంకా 'మిలియన్స్ హార్ట్స్' మొక్క పార్కుకు వచ్చే యువతీ యువకులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఒకే మొక్కకు వందల సంఖ్యలో గుండె ఆకారపు ఆకులు ఉండటం దీని ప్రత్యేకత. ఇది చూడటానికి ఎంతో ఆకర్షణీయంగా ఉండటంతోనే దీనికి 'మిలియన్స్ హార్ట్స్' అనే పేరు వచ్చింది.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు విశేష స్పందన

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఆదివారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్‌కు విశేష స్పందన లభించింది. అత్యధిక సంఖ్యలో విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్), కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడిగా కనిపించాయి. వాతావరణం చల్లగా ఉండటంతో కౌన్సెలింగ్ సజావుగా సాగింది. తల్లిదండ్రులు విశ్రాంతి తీసుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కౌన్సెలింగ్ సాగిందిలా..

- పాలిటెక్నిక్ కాలేజీలో రెండో రోజు 23,501 నుంచి 32,000 ర్యాంకు వరకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 340 మంది సర్టిఫికెట్లను పరిశీలించారు. వీరిలో 263 మంది బీసీ, 36 మంది ఓసీ, 32 మంది ఎస్సీ, 9 మంది ఎస్టీ విద్యార్థులు ఉన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రత్నకుమార్ పర్యవేక్షణలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ డాక్టర్ పీఎం భాషా, లెక్చరర్ నాగరాజు కౌన్సెలింగ్ చేపట్టారు. సోమవారం 40,001 నుంచి 50,000 ర్యాంకుల వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.
- గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ పర్యవేక్షణలో 15,001 నుంచి 23,500 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో 290 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. సోమవారం 32,001 నుంచి 40,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.


పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రత్నకుమార్

భీమిలి అర్చకుడు తిరుపతిలో అదృశ్యం

58 రోజులుగా ఆచూకీ లేదు

తగరపువలస: భీమిలి పట్టణంలోని భ్రమరాంబికా సహిత చోడేశ్వరస్వామి ఆలయ అర్చకుడు ఏడిద గణేష్ సుబ్రహ్మణ్య శాస్త్రి (49) 58 రోజుల కిందట తిరుపతిలో అదృశ్యం కాగా.. ఇప్పటి వరకు ఆయన ఆచూకీ లభ్యం కాలేదు. భీమిలి ప్రధాన రహదారిలో తన భార్య మాధురి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో కలిసి ఆయన అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. గత ఏప్రిల్ 24న కుటుంబ సభ్యులకు చెప్పి తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లిన అర్చకుడు, ఏప్రిల్ 26న తన భార్య మాధురికి ఫోన్ చేసి దర్శనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత నుంచి ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు కంగారుపడ్డారు. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆయన ఆచూకీ తెలియరాలేదు. అక్కడి పోలీసుల సాయంతో ఈ నెల 13న భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇక్కడి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌తో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే ఈ మిస్సింగ్ కేసుపై ఇప్పటివరకు ఎటువంటి పురోగతి లేదు. ఇటీవల భీమిలికి చెందిన వివాహిత బంగారు కవిత కూడా ఇదే విధంగా అదృశ్యమైన తర్వాత బంధువులు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. చివరకు ఆమె మృతదేహం పూర్తిగా శిథిలమైన పరిస్థితిలో ఎర్రమట్టి దిబ్బల వద్ద ఉన్న జీడితోటలో కనిపించింది. అర్చకుడి మిస్సింగ్ విషయంలో పోలీసులు గానీ, బంధువులు గానీ ఎలాంటి ఆతృత కనబరచకపోవడంతో.. దీని ముగింపు ఏమవుతుందోనని పట్టణ ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.


గణేష్ సుబ్రహ్మణ్య శాస్త్రి

పీఆర్ఎస్ఐ కార్యవర్గంలో విశాఖకు కీలక పదవులు

మహారాణిపేట: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ) జాతీయ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో విశాఖకు చెందిన ఇద్దరు ప్రముఖులకు స్థానం లభించింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో శనివారం వివిధ రాష్ట్రాల నుంచి పీఆర్ఎస్ఐ ప్రతినిధులు హాజరై ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ అజిత్ పాథక్ ఎన్నిక కాగా, విశాఖకు చెందిన స్వచ్ఛ భారత్ నిపుణుడు, రోటరీ జిల్లా–3020 మాజీ కార్యదర్శి, రోటరీ బ్లడ్ సెంటర్ మాజీ కార్యదర్శి, పీఆర్ఎస్ఐ విశాఖ శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పి.ఎల్.కె.మూర్తి వరుసగా రెండవసారి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అలాగే కోరమాండల్ సంస్థ మీడియా సలహాదారు, హెచ్.పి.సి.ఎల్. మాజీ అధికారి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు యు.ఎస్.శర్మను దక్షిణాది రాష్ట్రాలకు పీఆర్ఎస్ఐ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అలాగే 2025–2027 కాలానికి పలువురు కార్యనిర్వాహక సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన నాయకత్వ బృందం పీఆర్ఎస్ఐ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తుందని,, పబ్లిక్ రిలేషన్స్ మెరుగుదలకు, వృత్తిపరమైన అభివృద్ధికి కృషిచేయడానికి, సభ్యుల మధ్య నెట్ వర్కింగ్‌ను ప్రోత్సహించడం వంటి పనులను కొనసాగించడానికి కృషి చేస్తుందని జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.ఎల్.కె.మూర్తి పేర్కొన్నారు. పీఆర్ఎస్ఐ జాతీయ కార్యవర్గాన్ని విశాఖ శాఖ అధ్యక్షుడు ఎం.కె.వి.ఎల్.నరసింహం, కార్యదర్శి ఎ.గోవిందరావు, కోశాధికారి ఎన్.వి.నరసింహం, ఉపాధ్యక్షుడు, స్టీల్ ప్లాంట్ జనరల్ మేనేజర్ (పీఆర్) ఆర్.పి.శర్మ, శంకర ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పబ్లిక్ రిలేషన్స్ కె.బంగారు రాజు, విశాఖ శాఖ పూర్వ అధ్యక్షుడు కె.రామారావు తదితరులు అభినందించారు.


నూతన కార్యవర్గం

ప్రేమ సమాజం నూతన అధ్యక్షుడిగా మట్టపల్లి

డాబాగార్డెన్స్: ప్రేమ సమాజం కమిటీ నూతన అధ్యక్షుడిగా సంఘ సేవకుడు మట్టపల్లి చలమయ్య కుమారుడు మట్టపల్లి హనుమంతరావు నియమితులయ్యారు. డాబాగార్డెన్స్ ప్రేమసమాజం ఆడిటోరియంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వార్షిక కార్యదర్శి నివేదిక, జమాఖర్చులు, వార్షిక బడ్జెట్ నివేదికను సభ్యులు ఆమోదించారు. అనంతరం ప్రముఖ న్యాయవాది పి.నారాయణరావు చీఫ్ ఎన్నికల అధికారిగా 2025–27 కాలానికి ఏకగ్రీవంగా ఎన్నికైన 20 మంది కార్యవర్గ సభ్యుల పేర్లు ప్రకటించారు. ఎన్నికల అధికారి పీవీ నారాయణరావు సమక్షంలో నూతన కార్యవర్గ తొలి సమావేశం ఏర్పాటు చేస్తూ, నూతన కమిటీని వెల్లడించారు. అధ్యక్షుడిగా మట్టపల్లి హనుమంతరావు, ఉపాధ్యక్షుడు–1గా కేశప్రగడ నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడు–2 కంకటాల మల్లిఖార్జునరావు, కార్యదర్శిగా వి.మోహన్‌రావు, కోశాధికారిగా ఎంవీవీకే గుప్తా, సంయుక్త కార్యదర్శులుగా పి.లక్ష్మీగుప్తా, ఎస్.నాగేశ్వరరావు, ఎల్.వెంకట్రావు, అడ్వైజరీ సభ్యుడిగా డాక్టర్ పి.విశ్వేశ్వరరావు, ప్రేమ పాఠశాల కరస్పాండెంట్‌గా కోన జగదీశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ప్రేమసమాజం పూర్వ అధ్యక్షుడు బుద్ధ శివాజీ, పూర్వ కార్యదర్శి కె.హరిమోహన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పలువురు ప్రముఖులు పాల్గొని నూతన కమిటీని అభినందించారు.


మట్టపల్లి హనుమంతరావు

రారండోయ్.. వేడుక చూద్దాం..

- రేపటి నుంచి జగన్నాథుడి రథయాత్ర ఉత్సవాలు
- 27న తొలి రథయాత్ర
- 28 నుంచి స్వామి దశావతారాలు


జగన్నాథ, సుభద్ర, బలభద్రస్వామి


ఆలయ ముఖ ద్వారం


సిద్ధంగా ఉన్న స్వామి రథం

డాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వెలసిన చారిత్రక జగన్నాథస్వామి ఆలయంలో వార్షిక రథయాత్ర మహోత్సవాలు ఈ నెల 24 నుంచి జూలై 8 వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. 185 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ ఆలయంలో జరిగే ఈ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 24న మంగళవారం జ్యేష్ఠ బహుళ చతుర్దశి నాడు ప్రతిష్టా ప్రారంభ సంకల్పం, 25న అమావాస్య నాడు ఉదయం జలాధివాసములు, క్షీరాధివాసములు, రాత్రి విశేష హోమాలు, 26న ఆషాడ శుద్ధ పాడ్యమి నాడు ఉదయం పూర్ణాహుతి, నేత్రోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణం, సుభద్రాదేవి శాంతి కల్యాణం జరపనున్నారు. 27న ఉదయం 9.10 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానిస్తారు. సాయంత్రం 5 గంటలకు భక్తుల జయజయధ్వానాల మధ్య తొలి రథయాత్ర వైభవంగా ప్రారంభమవుతుంది.

టర్నర్ చౌల్ట్రీలో దశావతారాల దర్శనం

ఈ నెల 28 నుంచి జూలై 6వ తేదీ వరకు టర్నర్ చౌల్ట్రీ కల్యాణ మండపంలో జగన్నాథస్వామి భక్తులకు పది దివ్య అవతారాల్లో నయనానందకరంగా దర్శనమిస్తారు. 28న మత్స్యావతారం, 29న కూర్మావతారం, 30న వరాహావతారం, జూలై 1న నృసింహావతారం, 2న వామనావతారం, 3న పరశురామావతారం, 4న శ్రీరామావతారం, 5న బలరామ, శ్రీకృష్ణావతారం, 6న తొలి ఏకాదశి సందర్భంగా శేషపాన్పు అవతారంలో స్వామిని అలంకరిస్తారు.

తిరుగు రథయాత్ర

జూలై 7 న ఉదయం 9.45 గంటలకు స్వామి వారిని రథంపైకి ఆహ్వానిస్తారు. సాయంత్రం 5.10 గంటలకు టర్నర్ చౌల్ట్రీ నుంచి మేళ తాళాలు, బాణసంచా వెలుగుల మధ్య జై జగన్నాథ్ నామస్మరణతో తిరుగు రథయాత్రను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. 8న సంప్రోక్షణ అనంతరం స్వామిని యథాస్థానంలో పీఠారోహణం చేయడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

భక్తులకు సూచనలు

- ఈ నెల 28 నుంచి జూలై 6 వరకు ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక భగవద్గీత, విష్ణు పారాయణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయి. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.
- తొమ్మిది రోజుల పాటు తమ గోత్రనామాలతో పూజలు జరిపించుకోవాలనుకునే భక్తులు రూ. 500 చెల్లించి దేవస్థానం కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చు.
- దశావతార అలంకరణలు చేయించదలచిన భక్తులు ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డిని కార్యాలయంలో సంప్రదించవచ్చు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధికారులు కోరారు.

మద్యం మత్తులో ఒకరి హత్య

- హంతకుడు పరారీ
- గాలిస్తున్న న్యూపోర్టు పోలీసులు


తుప్పల్లో లభ్యమైన మహాదేవ్ మృతదేహం

పెదగంట్యాడ : మండలంలోని ఏపీఐఐసీ (ఐలా) ఆటోనగర్‌లో మహాదేవ్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోనగర్‌లో గల భవానీయార్డ్ అనే స్టీల్ ట్రేడర్స్‌లో ఛత్తీస్‌గఢ్ జగదల్‌పూర్‌కి చెందిన మహాదేవ్ (28), నరేష్ (29) కొన్నాళ్లుగా రాడ్ బెండింగ్ పనులు చేస్తున్నారు. ఇద్దరూ ఆ యార్డ్‌లోనే ఓ షెడ్‌లో ఉంటున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఇద్దరూ ఉదయం నుంచి మద్యం సేవిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరు మధ్య ఏమి జరిగిందో గానీ మహాదేవ్ తలపై నరేష్ కర్రతో బలంగా కొట్టి హత్య చేశాడు. ఆ పై మృతదేహాన్ని పక్కనున్న తుప్పల్లో పడేశాడు. అక్కడ నుంచి జారుకున్నాడు. ఆదివారం రాత్రి అటుగా వెళ్తున్న కార్మికులు తుప్పల్లో మృతదేహాన్ని చూసి న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ తోటాడ కామేశ్వరరావు సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నరేష్ పరారీ కావడంతో అతని కోసం గాలిస్తున్నారు.

సాగరతీరం.. జనసంద్రం


ఆర్.కె.బీచ్‌కు పోటెత్తిన జనం

సాగరతీరం..మళ్లీ జనసంద్రంగా మారింది. యోగాంధ్ర కార్యక్రమం ముగియగా.. పోలీసులు విధించిన ఆంక్షలను పూర్తిగా ఎత్తివేశారు. దీంతో వారం రోజుల నిరీక్షణకు తెరదించుతూ.. నగరవాసులు, పర్యాటకులు ఆదివారం ఆర్.కె.బీచ్, రుషికొండ, సాగర్‌నగర్, భీమిలి తీరాలకు పోటెత్తారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చిన ప్రజలు సముద్ర స్నానాలు చేస్తూ, ఇసుక తెన్నెలపై ఆడుకుంటూ ఉత్సాహంగా గడిపారు. సాయంత్రం వేళ ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుని, చల్లటి గాలులు వీయడంతో వాతావరణం మరింత ఆహ్లాదకరంగా మారింది. దీంతో స్థానికులతో పాటు విదేశీయులు సైతం బీచ్‌రోడ్డులో కనిపించారు. కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ–142 యుద్ధ విమాన మ్యూజియం వద్ద తదితర పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల రద్దీ కనిపించింది. వారం రోజులుగా వ్యాపారం లేక ఇబ్బంది పడిన బీచ్‌రోడ్డులోని చిరు వ్యాపారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. మురి మిక్చర్, మొక్కజొన్నపొత్తుల బండ్ల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది.

– ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, విశాఖపట్నం


బీచ్‌రోడ్డులో విదేశీ వనితలు


కమ్ముకున్న మేఘాలు


మధుర జ్ఞాపకం